సాక్షి
కుమురం భీం
సోమవారం ౹ 8 ౹ సెప్టెంబర్ ౹ 2025



రోడ్లపైనే పార్కింగ్

కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారులపై గంటల తరబడి వాహనాలు నిలిపి ఉంచుతున్నారు. రోడ్లపై పార్కింగ్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 9లో▸



వ్యర్థాలతో తప్పని తిప్పలు

కెరమెరి మండల కేంద్రంలోని ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. గ్రామ పంచాయతీ అధికారులు, స్థలాల యజమానులు పట్టించుకోవడం లేదు. 9లో▸

గరిష్టం/కనిష్టం
31.6 /24.1

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. రుతుపవనాల ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

రెచ్చిపోతున్న ఇసుకాసురులు!

రెబ్బెన మండలం గోలేటికి వెళ్లే దారిలోని పులికుంట వాగు వద్ద ఆదివారం కనిపించిన దృశ్యమిది. సెలవురోజున కూడా ట్రాక్టర్ల ద్వారా యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారు. అనుమతి ఉన్నా నిబంధనల ప్రకారం సెలవు రోజుల్లో తరలించేందుకు వీలుండదు. కానీ నిబంధనలు ఉల్లంఘిస్తూ విచ్చలవిడిగా అక్రమ రవాణా చేస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు.



- జిల్లాలో విచ్చలవిడిగా ఇసుక దందా
- సెలవు రోజుల్లో నిబంధనలు ఉల్లంఘిస్తూ తవ్వకాలు
- ఇతర జిల్లాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న వైనం
- విచ్చలవిడి తవ్వకాలతో వంతెనలకు పొంచి ఉన్న ముప్పు

తిర్యాణి(ఆసిఫాబాద్): జిల్లాలో కొద్దిరోజులుగా ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా దొరికిందే అదనుగా ఇష్టానుసారంగా ఇసుక తోడేస్తున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో అక్రమ రవాణా బహిరంగ రహస్యమే అయినా.. చర్యలు చేపట్టాల్సిన అధికారులు చూసీచూడనట్లుగా 'మాములు'గా తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఈ దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. ప్రకృతి అందాలకు నెలవైన జిల్లా నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే పక్కనే ఉన్న మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాలకు ఇసుక తరలించి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు.

భారీ వర్షాలకు మేటలు

రెబ్బెన మండలం పులికుంట, లక్ష్మీపూర్, రాంపూర్, గంగాపూర్ వాగుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఆసిఫాబాద్ మండల కేంద్రంలోని పెద్దవాగు, చీలాటిగూడ, భీంపూర్, తుంపెల్లి, చిర్రకుంట, కాగజ్‌నగర్ మండలంలోని అందవెల్లి, పెద్ద వాగుల్లో ఇటీవల కురిసిన వర్షాలకు నాణ్యమైన ఇసుక మేటలు వేసింది. దీనిని వ్యాపారంగా మలుచుకున్న కొంతమంది దళారులు సంబంధింత అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా నిత్యం వందల ట్రాక్టర్ల ద్వారా రవాణా చేస్తున్నారు. కొన్నిచోట్ల వాగులోని వంతెన పిల్లర్లను ఆనుకుని తవ్వకాలు సాగిస్తుండటంతో ప్రమాదం పొంచిఉంది. గతంలో అడ్డూఅదుపు లేని ఇసుక తవ్వకాలతోనే కాగజ్‌నగర్ మండలంలోని అందవెల్లి వంతెన పిల్లర్లు కుంగి బ్రిడ్జి కూలిపోయిందనే ఆరోపణలు వచ్చాయి.

సెలవు రోజుల్లో సైతం..

జిల్లాలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు ప్రస్తుతం జోరుగా సాగుతున్నాయి. 6,736 ఇళ్లు మంజూరు కాగా, 2,420 ఇల్లు బేస్‌మెంట్ దశ దాటాయి. దీంతో జిల్లాలో ఇసుకకు భారీ డిమాండ్ ఏర్పడింది. అధికారులు అడపాదడపా దాడులు చేస్తుండగా పలు ట్రాక్టర్లు పట్టుబడుతున్నాయి. అయినా దళారులు పట్టించుకోకుండా ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల పేరుతో లాభాల మత్తులో ఈ దందా కొనసాగిస్తున్నారు. గత వారం రెబ్బెన మండలం గోలేటికి వెళ్లే రోడ్డుకు ఆనుకుని ఉన్న పులికుంట వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా ఐదు ట్రాక్టర్లను స్థానిక తహసీల్దార్ పట్టుకున్నారు. వాటికి రూ.5 వేల చొప్పున జరిమానా విధించారు. అయినా మరుసటి రోజు నుంచే అక్కడ ఇసుక రవాణా యథావిధిగా కొనసాగుతుండటం గమనార్హం. దందా నడుస్తున్న తీరుకు ఇది అద్దం పడుతోంది.

అనుమతులు తప్పనిసరి

ఇసుక రవాణా కోసం సాధారణంగా రెవెన్యూ శాఖ నుంచి డీడీ రూపంలో నగదు చెల్లించి అనుమతి తీసుకోవాలి. ఒక వేళ సంబంధింత శాఖ నుంచి అనుమతి ఉన్నా అది కార్యాలయాల పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రవాణా చేయాలి. కానీ అక్రమార్కులు అవేమీ పట్టించుకోవడం లేదు. ఉదయం ఐదు గంటల నుంచే మొదలుకుని అర్ధరాత్రి దాటినా దందా సాగిస్తున్నారు. ఈ అక్రమ రవాణాలో ఓ పార్టీకి చెందిన పెద్దస్థాయి వ్యక్తి అండదండలు ఉండటంతో అక్రమ రవాణా అడ్డూఅదుపు లేకుండా పోయిందనే ఆరోపణలు సైతం ఉన్నాయి. కాగా, ఈ విషయమై మైనింగ్ ఏడీ గంగధర్‌ను సంప్రదించగా ఆయన స్పందించలేదు.

పెద్దవాగులో నిత్యం తవ్వకాలు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలం అందవెల్లి, బారెగూడ, వంజీరి గ్రామాల్లో పెద్దవాగు పరీవాహక ప్రాంతాల్లో నిత్యం ఇసుక తవ్వకాలు కొనసాగుతున్నాయి. పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను ఓ ప్రదేశంలో డంప్ చేసి.. రాత్రిపూట లారీల్లో హైదరాబాద్, వరంగల్, ఆదిలాబాద్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇటీవల కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అందవెల్లి పెద్దవాగును సందర్శించి ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసినా పరిస్థితిలో మార్పు రాలేదు.



అందవెల్లి పెద్దవాగులో ఇసుక ట్రాక్టర్లు(ఫైల్)

దందా అరికట్టడంలో అధికారులు విఫలం



జిల్లాలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణా దందాను అరికట్టడంలో జిల్లా అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం తీసుకెళ్తున్నామని చెప్పి ఇతర జిల్లాలకు తరలిస్తున్నారు. అధికారులు పట్టించుకోకుండా చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. నామమాత్రంగా దాడులు చేస్తూ ఒకటి, రెండు ట్రాక్టర్లు పట్టుకుని చేతులు దులుపుకొంటున్నారు.

– దుర్గం దినకర్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు

ప్రభుత్వ ఆస్పత్రిలో క్లిష్టమైన ప్రసవం



పాపతో నర్సింగ్ ఆఫీసర్

ఆసిఫాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం అర్ధరాత్రి క్లిష్టమైన ప్రసవం చేశారు. వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వాంకిడి మండలానికి చెందిన భీంబాయి శనివారం రాత్రి వాంకిడి ఆస్పత్రి నుంచి ప్రసవం కోసం జిల్లా ఆస్పత్రికి వచ్చింది. వైద్యుడు సందేశ్ ఆధ్వర్యంలో డెలివరీ కోసం యత్నించారు. అయితే బ్రీచ్ ప్రజెంటేషన్(ఎదురుకాళ్లు) సమస్య ఎదురుకావడంతో మంచిర్యాలకు పంపించేందుకు నిర్ణయించారు. కానీ అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో ఆగిపోయారు. ఆపరేషన్ చేయాల్సి ఉండగా క్లిష్టమైనా తీవ్రంగా శ్రమించి భీంబాయికి సాధారణ ప్రసవం చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉండడంతో అందరూ ఊపిరి పీల్చుకొన్నారు. ఆ తర్వాత పాపను పరీక్షల కోసం మంచిర్యాల జిల్లా ఆస్పత్రికి పంపించారు. కీలకంగా వ్యవహరించిన నర్సింగ్ అధికారి కవ్వాల రజితకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది ఆఫ్రిన్, ఆసియా పాల్గొన్నారు.

చంద్రగ్రహణం.. ఆలయాలు మూసివేత

కాగజ్‌నగర్‌రూరల్/ఆసిఫాబాద్‌అర్బన్: చంద్రగ్రహణం నేపథ్యంలో జిల్లాలోని ఆలయాన్నంటినీ ఆదివారం మధ్యాహ్నం తర్వాత మూసివేశారు. ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయంతోపాటు త్రినేత్ర శివాలయం, లక్ష్మీనారాయణ దేవాలయం, సత్యనారాయణ స్వా మి దేవాలయం, ఆసిఫాబాద్‌లోని కేశవనాథస్వామి దేవస్థానాన్ని అర్చకులు మూసివేశారు. సోమవారం ఉదయం6 గంటల తర్వాత ఆలయాలను శుద్ధి, సంప్రోక్షణ, అభిషేకాలు చేసి భక్తులకు దర్శన అవకాశం కల్పిస్తామని అర్చకులు తెలిపారు.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పతకాలు



బంగారు పతకం అందుకుంటున్న శ్రీయాన్

రెబ్బెన(ఆసిఫాబాద్): రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పతకాలు సాధించారని యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కేసరి ఆంజనేయులుగౌడ్ తెలిపారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ యోగాసన పోటీల్లో కాగజ్‌నగర్‌లోని ఫాతిమా కాన్వెంట్ హైస్కూల్‌కు చెందిన ఆరో తరగతి విద్యార్థి సీహెచ్ శ్రీయాన్ సుపైన్ పోజు విభాగంలో బంగారు పతకం సాధించగా, లెగ్ బ్యాలెన్స్ విభాగంలో కౌటాల జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి అఖిల్‌సింగ్ వెండి పతకం సాధించారన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన క్రీడాకారులకు ఈ నెల 28న విజయవాడలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభించిందని పేర్కొన్నారు. శ్రీయాన్, అఖిల్‌సింగ్‌ను తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి రాంరెడ్డి, జిల్లా కోచ్ ఏడుకొండ అభినందించారు.

కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్



బంగారు పతకంతో సాయి సంకీర్తన

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలకు చెందిన కాటం సాయి సంకీర్తన కరాటే పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిందని కరాటే మాస్టర్ చాపిడే కుమార్ ఆదివారం తెలిపారు. కరీంనగర్‌లోని రెవెన్యూ ఫంక్షన్ హాలులో జరిగిన కుంపూ కరాటే పోటీల్లో కాటా విభాగంలో ప్రతిభ చూపి గోల్డ్ మెడల్ సాధించిందని పేర్కొన్నారు. విద్యార్థినిని కరస్పాండెంట్ లంక కృష్ణప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆదివాసీ గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలి



మాట్లాడుతున్న పూసం సచిన్

ఆసిఫాబాద్: ఆదివాసీ గ్రామాల్లో వైద్య శిబిరాలు న్విహించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టీఏజీఎస్) రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీలు జ్వరాలతో మంచాన పడ్డారని, హాస్టల్ విద్యార్థులు కూడా జ్వరంతో బాధపడుతున్నారని తెలిపారు. వైద్యుల పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. తమ సంఘం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని, మెడికల్ షాపుల యజమానులు, ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు సహకరించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవికుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శి తనుషా, నాయకులు సక్కు, మడావి నాగోరావు, తొడసం శంభు, నెర్పెల్లి అశోక్, కోట శ్రీనివాస్, మడావి గణపతి, టీకానంద్ పాల్గొన్నారు.

ఘనంగా భాద్రపద పౌర్ణమి



బుద్ధ విహారలో అన్నప్రసాదాలతో బౌద్ధులు

వాంకిడి(ఆసిఫాబాద్): వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహారతోపాటు ఖమాన గ్రామంలోని నాగ్‌సేన్ బుద్ధ విహారలో ఆదివారం భాద్రపద పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బౌద్ధ భిక్షువు భరద్వాజ్ ఆధ్వర్యంలో విహారాల్లో పూజలు చేశారు. మహిళలకు అష్ట శీల్ ఉపోసత్ దీక్ష ప్రసాదించారు. మూడు నెలలపాటు నిర్వహించే వర్షవాస్ కాలంలో వచ్చే పౌర్ణమిలను ఎంతో పవిత్రంగా భావించి మహిళలు అష్టాంగ మార్గాలు పాటిస్తూ ఉంటారని తెలిపారు. రమాబాయి మహిళా మండలిలోని 30 మంది మహిళలు అష్టశీల్ ఉపోసత్ దీక్ష తీసుకున్నారు. భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, నాయకులు దుర్గాజీ, జయరాం ఉప్రె, శ్యాంరావు దుర్గె, పాండూజీ జాడె, కిషన్ ఖోబ్రగడె ఉన్నారు.

ప్రభుత్వ విధానాలతో పత్తి రైతులకు నష్టం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రవికుమార్



మాట్లాడుతున్న రవికుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: కేంద్ర ప్రభుత్వ విధానాలతో దేశంలోని పత్తి రైతులకు రానున్న రోజుల్లో తీవ్ర నష్టం జరుగుతుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బండారి రవికుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జిల్లా కార్యదర్శి రాజన్న అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాల కార్యదర్శులు రవి, మల్లేశ్‌తో కలిసి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పత్తి పంటపై 11 శాతం టారిఫ్‌ను సున్నకు తగ్గించడంతో దేశంలోని రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అమెరికా వంటి దేశాల నుంచి దేశానికి పత్తి పోటెత్తితే స్థానిక పంటకు సరైన ధర దక్కదన్నారు. అలాగే రాష్ట్రంలో నిర్దిష్ట విధానం లేకపోవడంతోనే యూరియా కొరత ఏర్పడుతుందని పేర్కొన్నారు. కలెక్టరేట్ సిబ్బంది వ్యవహారంపై ఎలాంటి ఒత్తిడులకు లొంగకుండా సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి రాజన్న మాట్లాడుతూ జిల్లాకు ప్రాణాధారమైన అడ ప్రాజెక్టుకు మరమ్మతులు లేకపోవడంతో 45వేల ఎకరాలకు కనీసం నాలుగు వేల ఎకరాలకు సాగునీరు అందించే పరిస్థితి లేదన్నారు. వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకోకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు దుర్గం దినకర్, కార్తీక్, రాజేందర్, ఆనంద్, టీకానంద్ పాల్గొన్నారు.

'జీఎస్టీ స్లాబ్ మార్పులతో ఊరట'



ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం చేసిన జీఎస్టీ స్లాబ్ మార్పులు పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట కలిగిస్తాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో ఆదివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ సామాన్యులకు బీజేపీ ప్రభుత్వం వస్తుసేవలపై పన్ను(జీఎస్టీ)లో మార్పులు తీసుకురావడంతో నూనెలు, టీవీలు, ఆరోగ్య ఉత్పత్తులు, హెల్త్ ఇన్సురెన్స్‌ల వంటి వాటిపై జీఎస్టీ పన్నుభారం తగ్గుతుందన్నారు. ప్రధానంగా విద్యా సామగ్రిపై జీఎస్టీ 12 శాతం ఉండగా పూర్తిగా తొలగించిందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కొత్తపల్లి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు శివకుమార్, మండల అధ్యక్షుడు అశోక్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, నాయకులు కిరణ్, బేబీ, చిప్పకుర్తి శ్రీనివాస్, చేరాల శ్రీనివాస్, మనోహర్‌గౌడ్, రమేశ్, అరుణ్‌లోయ పాల్గొన్నారు.

జీపీవోలు వచ్చేశారు..!

- జిల్లాకు 59 మంది గ్రామ పాలనాధికారులు
- ఇప్పటికే వివిధ శాఖల నుంచి రిలీవ్
- త్వరలోనే వారికి క్లస్టర్లు కేటాయింపు



జీపీవోలకు రిలీవింగ్ ఆర్డర్స్ జారీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ గజానంద్

ఆసిఫాబాద్: గ్రామస్థాయి రెవెన్యూ వ్యవస్థను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. జిల్లాలో 15 మండలాల పరిధిలో 335 గ్రామ పంచాయతీల పరిధిలో పనిచేసేందుకు 59 మంది గ్రామ పాలనాధికారులను నియమించింది. గ్రామస్థాయిలోని వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను గత ప్రభుత్వం రద్దు చేసింది. గతంలో వీఆర్వో, వీఆర్ఏలుగా పనిచేసిన ఉద్యోగులనే తాజాగా జీపీవోలుగా తీసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఆసక్తి గల ఉద్యోగులకు అర్హత పరీక్షలు నిర్వహించగా, ఉత్తీర్ణులైన వారిని ఒక్కో క్లస్టర్‌కు ఒకరు చొప్పున నియమించనున్నారు. ఈ నెల 6న హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఎంపికైన గ్రామ పాలనాధికారులకు నియామక పత్రాలు అందించారు. జిల్లాకు 59 మంది అధికారులను కేటాయించగా, జిల్లా నుంచి 52 మంది, మంచిర్యాల నుంచి ఏడుగురిని కేటాయించారు. జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న 16 మంది ఉద్యోగులు కూడా ఎంపికయ్యారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పర్యవేక్షణలో జిల్లా నుంచి 52 మంది హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సుల్లో తరలివెళ్లి హైటెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో నియామక పత్రాలు అందుకున్నారు. త్వరలో వీరికి పోస్టింగ్ ఇవ్వనున్నారు. ఇక నుంచి జీపీవోలు గ్రామ రెవెన్యూ వ్యవస్థలో కీలకంగా మారనున్నారు. భూభారతి చట్టంలో భాగంగా ప్రతీ రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌లో వీరు సహాయకారిగా పని చేయనున్నారు. పల్లెల్లో సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారుల ఎంపికపై విచారణ, ప్రభుత్వ, ప్రైవేటు భూములు, సర్వే నంబర్లు, చెరువులు, కుంటలు, శిఖం భూముతోపాటు పరిపాలన వ్యవహారాలన్నీ వీరే పర్యవేక్షిస్తారు. ప్రభుత్వం జూనియర్ అసిస్టెంట్ కేడర్‌లో జీపీవో పోస్టులను సృష్టించగా, వీరు 11 రకాల జాబ్‌చార్ట్ అనుసరించనున్నారు.

విధులు ఇవే..

గ్రామస్థాయిలో భూ ఖాతా నిర్వహణ, పహాణీల నమోదు, రెవెన్యూ రికార్డుల నిర్వహణతోపాటు అన్నిరకాల భూముల నిర్వహణ, మార్పులు చేర్పులు గ్రామ పాలనాధికారులే చేపట్టనున్నారు. వక్ఫ్‌బోర్డు, అసైన్డ్, దేవాదాయ, లావణీ భూముల నిర్వహణ చూస్తారు. ప్రాజెక్టులు, చెరువులు, కుంటల కింద భూముల పరిరక్షణ, ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం, ఆక్రమణలపై ప్రభుత్వ యంత్రాంగం తీసుకునే చర్యలకు సహకరిస్తారు. భూముల ఖాతాల నిర్వహణ, మార్పులు, చేర్పుల నమోదు. దరఖాస్తుదారులకు భూసర్వే సేవలు, ప్రకృతి విపత్తులు జరిగితే నష్టంపై అంచనా, గ్రామ స్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హుల ఎంపికలో విచారణ, జనన, మరణాల విచారణ, ఎన్నికల సమయంలో గ్రామ స్థాయిలో ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారు. జిల్లాకు 59 మంది అధికారులను కేటాయించగా వారికి క్లస్టర్లు కేటాయించాల్సి ఉంది.

జిల్లాకు 59 మంది..

జిల్లాకు 59 మంది గ్రామ రెవెన్యూ అధికారులను కేటాయించారు. వీరిలో 52 మంది కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి, మంచిర్యాల నుంచి ఏడుగురు నియామకమయ్యారు. వీరికి క్లస్టర్లు కేటాయించాల్సి ఉంది.

– లోకేశ్వర్‌రావు, ఆర్డీవో, ఆసిఫాబాద్

పకడ్బందీగా విధులు నిర్వహిస్తా



ఏడాదిగా జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నా. జీపీవో నోటిఫికేషన్ రావడంతో పరీక్ష రాసి ఎంపికయ్యాను. గ్రామస్థాయిలో ప్రజలకు రెవెన్యూ సేవలు అందించడంతో పాటు భూభారతి చట్టం అమలుకు కృషి చేస్తా. గ్రామ పాలనాధికారిగా పకడ్బందీగా విధులు నిర్వర్తిస్తా.

– రాజు, జీపీవో, భూపాల్‌పల్లి

పకడ్బందీ చర్యలు.. ప్రశాంత నిమజ్జనం

- సత్ఫలితాలు ఇచ్చిన ముందస్తు చర్యలు
- జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన వినాయక నిమజ్జనోత్సవం



గణపతి శోభాయాత్రను పర్యవేక్షిస్తున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్, పోలీసు అధికారులు

కౌటాల(సిర్పూర్): జిల్లాలో వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జిల్లా యంత్రాంగం, పోలీసుశాఖ చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయి. గతేడాది కాగజ్‌నగర్ మండలంలోని పెద్దవాగు వద్ద నిమజ్జనం సమయంలో ఇద్దరు మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఈ ఏడాది వినాయక చవితి ఉత్సవాల నిర్వహణపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. పక్కా ప్రణాళికతో పది రోజుల ముందు నుంచే శాంతికమిటీల సమావేశాలు నిర్వహించడంతోపాటు యువకులకు మండపాల ఏర్పాటుకు అనుమతులు, విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. మండపాల వద్ద మద్యం తాగడం, పేకాటడం, అసభ్యకరమైన నృత్యాలను నిషేధించారు. అలాగే అమాయకులు మోసపోతున్నారని గుర్తించి ఈ ఏడాది లక్కీలాటరీలపైనా నిషేధం విధించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. విగ్రహాల నిమజ్జనం కోసం తగిన ఏర్పాట్లు చేసి వేడుకలు పూర్తి చేశారు. శోభాయాత్రలను ఎస్పీ కాంతిలాల్ పాటిల్‌తోపాటు ఏఎస్పీ చిత్తరంజన్ బైక్‌పై తిరుగుతూ రాత్రిపూట సైతం పర్యవేక్షించారు.

వెయ్యికిపైగా విగ్రహాలు

ఈ ఏడాది జిల్లాలో వెయ్యికి పైగా విగ్రహాలు ఏర్పాటు చేయడంతో అధికార యంత్రాంగం నిమజ్జనానికి వాగుల వద్ద పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. జిల్లా పరిధిలో మొత్తం 1,026 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయగా.. చివరి మూడు రోజుల్లోనే 900కు పైగా విగ్రహాలను నిమజ్జనం చేశారు. పోలీసులు ప్రణాళిక ప్రకారం బ్లూకోల్ట్ సిబ్బంది వద్ద ఉన్న ట్యాబ్‌లతో గణపయ్య మండపం ఫొటో తీసి ఆన్‌లైన్ ద్వారా జియోట్యాగింగ్ చేశారు. గణేశ్ శోభాయాత్రల్లో డీజేలకు అనుమతి నిరాకరించారు. అలజడులు జరగకుండా రెండు రోజులపాటు వైన్స్‌లను మూసి మద్యం అమ్మకాలపై దృష్టి సారించారు. ఉత్సవాల్లో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీ, ఏఎస్పీ, డీఎస్పీలు, 8 మంది సీఐలు, ముగ్గురు ఆర్ఐలు, 19 మంది ఎస్సైలు, ఆరుగురు ఆర్ఎస్సైలు, 295 మంది సిబ్బంది విధులు నిర్వర్తించారు. కీలకమైన కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పట్టణాల్లో నిమజ్జన ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు సైతం చేపట్టారు. పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, అగ్నిమాపక, ఆరోగ్య శాఖలు సమన్వయంతో నిమజ్జన ప్రక్రియను ఆదివారం వేకువజాము వరకు విజయవంతంగా పూర్తిచేశారు.

అందరి సహకారంతోనే..

జిల్లావ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో గణేశ్ నిమజ్జనాలు జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికార యంత్రాంగం సమన్వయంతో ప్రక్రియ పూర్తి చేశాం. క్షేత్రస్థాయిలో కష్టపడి విధులు నిర్వర్తించిన అధికారులు, సిబ్బందికి అభినందనలు. ఉత్సవాల నేపథ్యంలో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి పకడ్బందీగా అమలు చేశాం. ఇదే స్ఫూర్తితో జిల్లావాసులు శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖకు ఎల్లప్పుడూ సహకరించాలి.

– కాంతిలాల్ పాటిల్, ఎస్పీ

క్లుప్తంగా

అంబులెన్స్‌లో ప్రసవం



జన్మనిచ్చిన ఆడపిల్లతో తల్లి

ఇచ్చోడ: బజార్‌హత్నూర్ మండలం సోనేరావు గూడ గ్రామానికి చెందిన జయమాల అనే గర్భిణి అంబులెన్స్‌లో ప్రసవించింది. ఆదివారం ఆమెకు పురిటినొప్పులు రావడంతో భర్త చరణ్‌దాస్ అంబులెన్స్ సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు అక్కడికి చేరుకుని ఆమెను ఇచ్చోడ పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు అధికమయ్యాయి. అంబులెన్స్‌ను రోడ్డు పక్కన నిలిపి ఈఎంటీ శశికాంత్ ఆమెకు ప్రసవం చేయగా ఆడపిల్లకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డను ఇచ్చోడ పీహెచ్‌సీకి తరలించారు. ఈఎంటీ శశికాంత్, పైలెట్ జైసింగ్‌లకు మహిళ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

క్షుద్రపూజల కలకలం

కెరమెరి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో క్షుద్రపూజల కలకలం రేపింది. గత కొంత కాలంగా పలు ప్రాంతాల్లో కుంకుమ, అగర్‌వత్తులు, నిమ్మకాయలతో పూజలు చేసినట్లు ఆనవాళ్లు కనిపించాయి. తాజాగా శనివారం రాత్రి ఓ ఇంటి ఎదుట నిమ్మకాయ, గుడ్డు ఉండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎవరికి హానీ చేయాలని ఇలా చేస్తున్నారు? లేదా గుప్తనిధుల కోసం ఇలా చేస్తున్నారో తెలియడం లేదని అంటున్నారు.

ఎడ్యుకేషన్ లోన్ పేరిట మోసం

మందమర్రిరూరల్: ఎడ్యుకేషన్ లోన్ పేరిట యువకుడు మోసపోయిన ఘటన మందమర్రిలో చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. మూడవ జోన్‌కు చెందిన యువకుడు ఆన్‌లైన్‌లోని ఓ వెబ్‌సైట్‌లో రూ.50 వేల ఎడ్యుకేషన్ లోన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఆ వెబ్‌సైట్ నుంచి యువకుడి వివరాల సేకరణలో భాగంగా లోన్ ఆమోదం అయిందని నమ్మించి అతని ఆధార్, పాన్‌కార్డు, వ్యక్తిగత వివరాలు, ఖర్చులకు రూ.37,500 చెల్లించాలని చెప్పారు. డబ్బులు చెల్లించిన తర్వాత లోన్ రాకపోయేసరికి మోసపోయానని గ్రహించాడు. వెంటనే సైబర్ క్రైం హెల్ప్‌లైన్ నంబర్ 1930కి ఫిర్యాదు చేయగా ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుకు యువరైతు మృతి



చిక్రం లింగు (ఫైల్)

నేరడిగొండ: అడవి పందుల బారి నుంచి పంట కాపాడుకునేందుకు కాపలా వెళ్లిన యువ రైతు పాముకాటుకు గురై మృతి చెందాడు. మండలంలోని గాజిలి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అనసూయ–వెంకట్ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. గ్రామంలో పదెకరాల వ్యవసాయం చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రెండో కుమారుడు యువ రైతు చిక్రం లింగు (20) బుధవారం రాత్రి వారి పంట కాపలా కోసం అక్కడికి వెళ్లాడు. గురువారం ఉదయం ఇంటికి రాకపోయేసరికి కుటుంబీకులు వెళ్లి చూడగా లింగు అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానిక వైద్యుడికి చూపించగా, మెరుగైన వైద్యం కోసం 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. శనివారం రాత్రి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఆదిలాబాద్‌లో గుర్తుతెలియని వ్యక్తి..



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఆదిలాబాద్ టౌన్: పట్టణంలోని తిర్పెల్లి సమీపంలో గల రైల్వేస్టేషన్ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. రైల్వే సిబ్బంది సమాచారం ఇవ్వడంతో ఆదివారం సంఘటన స్థలానికి చేరుకున్నట్లు పేర్కొన్నారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 ఏళ్ల వరకు ఉంటుందని తెలిపారు. మృతదేహాన్ని రిమ్స్ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించినట్లు చెప్పారు. ఎవరైన మృతదేహాన్ని గుర్తుపడితే టూటౌన్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

గ్రహణం ఎఫెక్ట్.. ఆలయాలు మూసివేత

'గూడెం' వద్ద..



దండేపల్లి: సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు దండేపల్లి మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ప్రధాన ఆలయంతోపాటు, అనుబంధ ఆలయాలను మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం భక్తుల దర్శనాలు ప్రారంభమవుతాయని ఆలయ ఈవో శ్రీనివాస్ పేర్కొన్నారు.



మూసివేసిన శ్రీ లక్ష్మీ నారాయణస్వామి ఆలయం

జైనథ్‌లో

జైనథ్: మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయానికి ఆదివారం ఉదయం 10:30 గంటలకు మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం 4:00 గంటలకు తెరవనున్నారు. గ్రహ సంప్రోక్షణ, అనంతరం స్వామివారికి హారతి కార్యక్రమం తర్వాత 6 గంటలకు భక్తులకు స్వామివారి దర్శనం ఉంటుందని ఈవో చంద్రశేఖర్ తెలిపారు.

మూసివేసిన కాల్వ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రధాన ద్వారం



దిలావర్‌పూర్‌లో..

దిలావర్‌పూర్: మండలంలోని ప్రధాన ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం మూసివేశారు. స్థానిక ఏకనాథుని, రేణుక ఎల్లమ్మ, నవాంజనేయ, శ్రీమాతా న్నపూర్ణ పాపహరేశ్వర, కాల్వ పరిసర అటవీ ప్రాంతంలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయాలను అర్చకులు మూసివేశారు. సోమవారం సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనం కలుగజేస్తామని ఆలయ వర్గాలు వెల్లడించాయి.

కొలిక్కి వచ్చినట్లేనా..

- చెన్నూర్ ఎస్బీఐ కేసులో పురోగతి
- 19 కిలోల బంగారు ఆభరణాలు రికవరీ?
- రెండురోజుల్లో పూర్తి రికవరీకి అవకాశం
- కోర్టు ద్వారా బ్యాంక్‌కు అప్పగించనున్న పోలీసులు



చెన్నూర్ ఎస్బీఐ

చెన్నూర్: చెన్నూర్ ఎస్బీఐ–2 బ్రాంచిలో కుంభకోణం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. 20 కిలోల బంగారు ఆభరణాలు, రూ.1.10 కోట్ల నగదు కోంభకోణ కేసును పక్షం రోజుల్లో రామగుండం సీపీ నేతృత్వంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చెన్నూర్ సీఐ దేవేందర్‌రావు 90 శాతం పురోగతి సాధించినట్లు తెలిసింది. పోలీసులు సుమారు 19 కిలోల బంగారు ఆభరణాలు రికవరీ చేసినట్లు తెలిసింది. ఈనెల 3 నుంచి 6 తేదీ వరకు గణేశ్ నిమజ్జనంలో పోలీసు అధికారులు బిజీబిజీగా ఉన్నారు. సోమవారం పనిదినాలు కావడంతో రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో బంగారు అభరణాలు రికవరీ చేసే అవకాశం ఉందని సమాచారం.

రికవరీ బంగారం కోర్టు ద్వారానే..

పోలీసులు పూర్తిస్థాయిలో రికవరీ చేసిన బంగారు ఆభరణాలను కోర్టులో అప్పగిస్తారని తెలిసింది. బ్యాంక్ లీగల్ అడ్వయిజర్ బ్యాంక్‌లో మాయమైన ఆభరణాల వివరాలను కోర్టుకు అప్పగించి స్వాధీనం చేసుకుంటారని సమాచారం. ఇదంతా పక్షం రోజులు పడుతుందని తెలిసింది. కోర్టు ద్వారా బ్యాంక్ స్వాధీనం చేసుకున్న తర్వాత బాధితుల వారీగా నగలు పరిశీలించాల్సి ఉంటుంది. 20 కిలోల బంగారు ఆభరణాలు కావడంతో 402 మంది బాధితులకు సంబంధించినవి వేరు చేయాలంటే రెండు నెలలు పట్టే అవకాశం ఉందని బ్యాంక్ అధికారులు అంటున్నారు.

నేడు బ్యాంక్ ఎదుట ఆందోళన?

ఎస్బీఐలో గోల్డ్ రికవరీ అయిన తర్వాత ఆభరణాలు ఎప్పుడిస్తారనే అనుమానం బాధితులను వెంటాడుతుంది. పూర్తిస్థాయిలో అధికారులు తమకు ఎప్పుడిస్తారనే సమాచారం లేక సోమవారం బ్యాంక్ ఎదుట ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. అధికారులు స్పష్టమైన హామీ ఇచ్చేవరకు ఆందోళన కొనసాగిస్తామని పలువురు బాధితులు చర్చించుకుంటున్నట్లు తెలిసింది.



దిగువకు వెళ్తున్న నీరు

కడెం ప్రాజెక్ట్ గేటు ఎత్తివేత

కడెం ప్రాజెక్ట్ గరిష్ట నీటిమట్టానికి చేరుకుంది. ఆదివారం ఉదయం ప్రాజెక్ట్‌కు 4402 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండడంతో ఒక వరద గేటు ఎత్తి 4,053 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 699.450 అడుగులుగా ఉంది. – కడెం



నిండుకుండలా 'ఎల్లంపల్లి'

ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్ట్‌లతోపాటు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న భారీ వరదతో ఎల్లంపల్లి జలాశయం నిండుకుండలా మారింది. ఆదివారం ప్రాజెక్ట్ నీటిమట్టం 148 మీటర్ల క్రస్ట్ లెవెల్‌కు గాను 147.58 మీటర్లకు 148, 20.175 టీఎంసీలకు గాను 20.175 టీఎంసీలతో ఉంది. ఇన్‌ఫ్లో కింద 1,500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా అవుట్ ఫ్లో కింద హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 315 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. 2 గేట్లు తెరిచి 1,185 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలిపెడుతున్నారు. – మంచిర్యాలరూరల్(హాజీపూర్)

నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్

- 16 తులాల బంగారు ఆభరణాలు అప్పగింత

లక్ష్మణచాంద: పోగొట్టుకున్న ఆభరణాలు, నగదును బాధితురాలికి అప్పగించి ఆటోడ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి..కడెం మండల కేంద్రానికి చెందిన కొంక సుజాత ఖానాపూర్‌లో ఆరోగ్యమిత్రగా విధులు నిర్వహిస్తోంది. ఆమె కుమార్తె వివాహానికి 16 తులాల బంగారు ఆభరణాలు నిర్మల్‌లో చేయించింది. శనివారం కుమారుడితో కలిసి బంగారు ఆభరణాలు తీసుకుని బైక్ పక్కన బ్యాగులో ఉంచి మధ్యాహ్నం కడెంకు బయల్దేరారు. ఈక్రమంలో బ్యాగు ఎక్కడో పడిపోయింది. ఈ విషయమై సోషల్ మీడియాలో పోస్టు చేశారు. లక్ష్మణచాంద మండలం రాచాపూర్‌కు చెందిన ఆటోడ్రైవర్ తక్కల సాయికుమార్ నిర్మల్ నుంచి లక్ష్మణచాంద వెళ్తున్నాడు. నిర్మల్‌రూరల్ మండలం కొండాపూర్ ఫ్లైఓవర్ సమీపంలో 61వ జాతీయ రహదారిపై బ్యాగు పడి ఉండడాన్ని గమనించి ఇంటికి తీసుకెళ్లాడు. సోషల్ మీడియాలో చూసిన సాయికుమార్ ఆదివారం బాధితురాలి వివరాలు తెలుసుకున్నాడు. రాచాపూర్‌లో 16 తులాల బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగును ఆమెకు అందించారు.



సుజాతకు బంగారు ఆభరణాలు అందిస్తున్న ఆటోడ్రైవర్ సాయికుమార్

బ్యాగు అందించి నిజాయితీ చాటిన సాయికుమార్‌ను సుజాత కుటుంబ సభ్యులు, పలువురు అభినందించారు.

డ్రగ్స్ ముఠా వెనుక కాంగ్రెస్ హస్తం

- బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్‌రూరల్: డ్రగ్స్ ముఠా వెనుక కాంగ్రెస్ నాయకుల హస్తం ఉండటంతోనే చూసీచూడనట్లు వదిలేస్తున్నారని బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. హైదరాబాద్‌లోని చర్లపల్లిలో రూ.12వేల కోట్ల విలువైన డ్రగ్స్ ఓ కంపెనీలో పట్టుబడటం దారుణమని, దీనికి బాధ్యత వహిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ మండలం కోసినిలోని ఆయన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహారాష్ట్ర పోలీసులు నెల రోజుల పాటు కాపుకాసి అన్ని ఆధారాలతో దాడులు చేసి డ్రగ్స్ పట్టుకున్నారని, తెలంగాణ పోలీస్ వ్యవస్థ పూర్తిగా విఫలమైందన్నారు. డ్రగ్స్ మొక్క ఎక్కడ ఉన్నా గద్దలా పీకేస్తామని, దీని కోసం ఈగల్ అనే ఈ కొత్త డిపార్ట్‌మెంట్ ప్రారంభిస్తామని చెప్పిన సీఎం చర్లపల్లిలో డ్రగ్స్ ఎందుకు పట్టుకోలేదని ప్రశ్నించారు.



మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

ఎస్పీఎం కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించాలి

సిర్పూర్ పేపరుమిల్లులో కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించాలని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఇటీవల మిల్లు ప్రమాదంలో ఎన్నం భాస్కర్ అనే కాంట్రాక్టు కార్మికుడు గాయపడిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. మిల్లు నుంచి వచ్చే విషవాయువులతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సమావేశంలో నాయకులు శ్యాంరావు, కొంగ సత్యనారాయణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న హిందుత్వ వాదులు, ఛత్రపతి శివాజీ అభిమానులు, కాంగ్రెస్ నేతలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాలలో శనివారం వినాయక నిమజ్జనం కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుపై అసత్య ఆరోపణలు చేసిన మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావుపై చర్యలు తీసుకోవాలని హిందుత్వవాదులు, ఛత్రపతి శివాజీ అభిమానులు, కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసిన అనంతరం మాట్లాడారు. గణేశ్ నిమజ్జనాన్ని హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించగా, వేదికపైకి వచ్చిన మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అసత్యపు మాటలతో రాజకీయ వేదికగా మార్చి, విద్వేషాలతో ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యేతోపాటు అనుచరులపై మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఎస్జీఎఫ్ క్రీడలు విజయవంతం చేయండి

ఇచ్చోడ: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా త్వరలో నిర్వహించే ఎస్జీఎఫ్ క్రీడలను విజయవంతం చేయాలని ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ఆడే రామేశ్వర్ కోరారు. మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో క్రీడాజట్ల ఎంపిక పోటీల నిర్వహణపై చర్చించారు. 43 క్రీడాంశాల్లో 14, 17 ఏళ్ల విభాగం బాలుర, బాలికల జోనల్ వేదికలు ఖరారు చేసినట్లు తెలిపారు. జట్ల ఎంపికను పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయ, క్రీడా సంఘాలు, పీడీ, పీఈటీలు, సహకారంతో పోటీలు విజయవంతం చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. సమావేశంలో మంచిర్యాల, నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాల ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు ఎండీ యాకుబ్, రవీందర్ గౌడ్, వెంకటేశ్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా వ్యాయమ విద్యా ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.పార్థసారథి, బుక్యా రమేశ్, కె.భోజన్న, సాయికుమార్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆడే రామేశ్వర్

మూడు ఆలయాల్లో చోరీ



అగ్గిమల్లన్న ఆలయంలో హుండీని పగులగొట్టిన దొంగలు

ఖానాపూర్: పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంతోపాటు తర్లపాడ్‌లోని ఓంకారేశ్వర, అగ్గిమల్లన్న ఆలయాల్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో 6 సీసీ కెమెరాలు, డీవీఆర్, 4 గ్రాముల పుస్తెలు, ఓంకారేశ్వర ఆలయంలో సీసీ కెమెరాతోపాటు హుండీలో నగదు, కానుకలు, అగ్గిమల్లన్న ఆలయంలో హుండీని పగులగొట్టి నగదు, కానుకలను దొంగలు ఎత్తుకెళ్లారు. పట్టణంలోని శివాజీనగర్ కాలనీకి చెందిన సూదం శ్రీనివాస్ బైక్‌ను దొంగిలించారు. ఆలయకమిటీ సభ్యుల ఫిర్యాదులపై కేసులు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య

జైపూర్: సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. ఇందారం ఐకే–ఓసీపీలో ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ ప్రధాన కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్బర్ అలీతో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. తాము గుర్తింపు సంఘంగా ఉన్నప్పుడే కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత, వైద్య సౌకర్యం, మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. ఆ తర్వాత వచ్చిన గుర్తింపు సంఘాలు కనీసం వారిని పట్టించుకోలేదన్నారు. తాము తిరిగి మళ్లీ గుర్తింపు సంఘంగా గెలిచిన వెంటనే పర్మినెంట్ కార్మికులకు మాదిరిగా వారికి లాభాల్లో వాటాగా రూ.5 వేలు ఇప్పించినట్లు తెలిపారు. హైపవర్ కమిటీ వేతనాలు, చట్టబద్ధమైన లీవు, సిక్, జాతీయ పండుగల సెలవులు ఇవ్వాలని సంస్థను కోరినట్లుగా తెలిపారు. అనంతరం ఓపెన్‌కాస్టులో పని చేస్తున్న కార్మికులు ఏఐటీయూసీలో చేరగా వారిని యూనియన్‌లోకి ఆహ్వానించారు.



కండువా కప్పుతున్న సీతారామయ్య

పాపికొండలను తలపిస్తున్న 'కడెం'

- హైకోర్టు జడ్జి సృజన

కడెం: కడెం ప్రాజెక్ట్ అందాలు బాగున్నాయని, పాపికొండలను తలపిస్తుందని హైకోర్టు జడ్జి సృజన అన్నారు. శనివారం రాత్రి కుటుంబ సభ్యులతో కడెం వచ్చారు. బృందావన్ రిసార్ట్స్‌లో విడిది అనంతరం ఆదివారం ఉదయం కడెం ప్రాజెక్ట్‌ను సందర్శించారు. ఆయకట్టు, వరద గేట్లు, నీటిమట్టం తదితర వివరాలను తెలుసుకున్నారు. అనంతరం మిషన్ భగీరథ ఇంటెక్‌వెల్‌ను పరిశీలించారు. ప్రాజెక్ట్‌లో కుటుంబ సభ్యులతో కలిసి బోటింగ్ చేశారు.



బోటింగ్ చేస్తున్న సృజన, కుటుంబీకులు

ఆమె వెంట జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీవాణి, ఆర్‌ఐ శారద, రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ సిబ్బంది ఉన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

రెబ్బెన: రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించి జిల్లాకు మరింత పేరు తీసుకురావాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుల్బం చక్రపాణి అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్–14 బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలకు సుమారు 30 మంది బాలికలు, 20 మంది బాలుర హాజరయ్యారు. అనంతరం క్రీడాకారులకు పోటీలు నిర్వహించి జిల్లా జట్లను ఎంపిక చేశారు. ఈనెల 13 నుంచి 14 వరకు జనగామ జిల్లా కూనురులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపతి తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, సీనియర్ క్రీడాకారులు నరేశ్ పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ నాయకులు

ఎంపికైన క్రీడాకారులు

ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ బాలిక జట్టుకు ఎం.సహస్ర, టి.ప్రజ్వలశ్రీ, పి.శ్రావ్య,ఎస్.సాయిశ్రీ వర్షిణి, డి.వేరోనికా, జి.హన్నా, పి.సిరి, బి.రాజేశ్వరి, పి.పవిత్ర, ఎండీ అల్ఫీన, ఎస్.రిషిత, డి.నందిని, ఎస్.విజయస్ఫూర్తి, ఎండీ జేబా, బాలుర జట్టుకు వరుణ్, నిఖిల్, ఎం.కృష్ణ లోకనందు, సీహెచ్ అఖిల్, బి.రాఘవ, బి.ఆంజనేయులు, కె.స్టీఫెన్, జె.అశ్విన్, ఎం.తిరుపతి, సీహెచ్ అరవింద్, డి.విష్ణు వర్ధన్, ఎం.త్రిచూర్ కృష్ణ ఎంపికయ్యారు.

సెపక్‌తక్రా ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపిక

రెబ్బెన: మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో సింగరేణి ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఆదివారం సెపక్‌తక్రా ఉమ్మడి జిల్లా సీనియర్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైనవారు ఈనెల 20 నుంచి 22 వరకు మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తిలో పాలిటెక్నిక్ కళాశాలలో జరగబోయే అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటారని అసోషియేషన్ ఉమ్మడి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కుమ్మరి మల్లేశ్ తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, క్రీడాకారులు నరేశ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు..

సెపక్‌తక్రా ఉమ్మడి జిల్లా సీనియర్ పురుషుల జట్టుకు ఆడే రాజేందర్, ఆర్.వెంకటేశ్, చందు, రాజశేఖర్, రాందాస్, మహిళల జట్టుకు టి.అనూష, కె.స్ఫూర్తి కారుణ్య, జె.నేహశ్రీ, అభినవ రమ్య, కె.శ్రీవల్లి ఎంపికయ్యారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులను అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.నారాయణరెడ్డి, సెపక్‌తక్రా అసోషియేషన్ సంయుక్త కార్యదర్శి శిరీష, ఎగ్జిక్యూటివ్ మెంబర్ కె.భాస్కర్, ఆర్.రామకృష్ణ, జి.శ్రీధర్, పి.సాంబయ్య అభినందించారు.



ఎంపికైన క్రీడాకారులు

ఎదురెదురుగా ఢీకొన్న రెండు కార్లు

ముథోల్: మండలంలోని తరోడా గ్రామం వద్ద ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై బిట్లాపెర్సిస్ కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం నీల గ్రామానికి చెందిన బలరాం, వర్ని మండలానికి చెందిన అనసూయ ఆదివారం భైంసా నుంచి నిజామాబాద్‌కు కారులో వెళ్తున్నారు. నిజామాబాద్ నుంచి భైంసాకు నవ్యశ్రీ, అనురాధ కారులో వస్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. బలరాం, అనుసూయలకు తీవ్రగాయలై ఇద్దరి కాళ్లు విరిగాయి. నవ్యశ్రీ, అనురాధలకు స్వల్పగాయాలయ్యాయి. ఘటన స్థలానికి ఎస్సై చేరుకుని క్షతగాత్రులను భైంసా ఏరియాస్పత్రికి తరలించారు.